క్లుప్తంగా

మాయమాటలతో చైన్లు కొట్టేసిన పీఈటీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండల కేంద్రంలోని వివేకానంద స్కూల్‌లో రామ్‌భూపాల్‌రెడ్డి అనే పీఈటీ ఇద్దరు చిన్నారులకు మాయమాటలు చెప్పి రెండు బంగారు చైన్‌లను అపహరించాడు. వివరాలు.. బుచ్చిరెడ్డిపాళెంలోని వివేకానంద స్కూల్‌లో రామ్‌భూపాల్‌రెడ్డి పీఈటీగా పనిచేస్తున్నాడు. అదే స్కూల్‌లో చదువుతున్న ఇద్దరు విద్యార్థులతో (ఒకరికి తెలియకుండా మరో విద్యార్థికి) మాయమాటలు చెప్పి రెండు బంగారు చైన్‌లను తీసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వెళ్లిన చిన్నారులను వారి తల్లిదండ్రులు బంగారు చైన్ల విషయమై అడగ్గా పీఈటీ మాస్టార్‌కు ఇచ్చామని తెలిపారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పీఈటీ మాస్టర్‌కు కాల్ చేయగా ఫోన్ స్విచాఫ్ వచ్చింది. అనుమానంతో స్కూల్ వద్దకు వెళ్లి కరస్పాండెంట్ సుబ్బారెడ్డిని కలిసి జరిగిన విషయాన్ని తెలియజేశారు. అనంతరం పీఈటీ మాస్టర్ ఇంటి వద్దకు తల్లిదండ్రులు వెళ్లగా అప్పటికే రామ్‌భూపాల్‌రెడ్డి చైన్లతో పరారైన విషయం తెలిసిందన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు ఈ విషయమై బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సర్వేపల్లిలో గ్రావెల్ రోడ్లకు రూ.6.21 కోట్లు

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలో ఐదు మండలాలకు మార్కెటింగ్ శాఖ ద్వారా గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి రూ.6.21 కోట్లు మంజూరు చేసినట్లు మార్కెటింగ్ శాఖ డీఈ నారాయణరావు వెల్లడించారు. ఆయన సోమవారం మాట్లాడుతూ వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. పొదలకూరు మండలంలో 70 రోడ్ల నిర్మాణానికి రూ.1.98 కోట్లు, ముత్తుకూరులో 21 రోడ్లకు రూ.75 లక్షలు, మనుబోలులో 40 రోడ్లకు రూ.1.50 కోట్లు, టీపీ గూడూరులో 34 రోడ్లకు రూ.96 లక్షలు, వెంకటాచలంలో 34 రోడ్ల నిర్మాణానికి రూ.1.02 కోట్లు మంజూరు అయినట్లు చెప్పారు. రైతులకు ఉపయోగపడేలా గ్రావెల్ రోడ్లను గుర్తించి అంచనాలు రూపొందించామన్నారు. త్వరలో పనులను మొదలు పెడుతామన్నారు.

ఘనంగా ధర్మప్రచార యాత్ర



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో ధర్మప్రచార యాత్ర సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల ప్రతిమలతో ధర్మ ప్రచార యాత్ర చేశారు. అనంతరం సుదర్శన హోమం, కుంకుమార్చన, స్వామి, అమ్మవార్ల కల్యాణ ఘట్టాలను వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి

కోవూరు : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బూత్ లెవల్ అధికారులు ఓటు హక్కుపై ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎం.పద్మజ అన్నారు. కోవూరు తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్ లెవల్ అధికారులతో సోమవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బూత్‌లెవల్ అధికారి వారివారి పోలింగ్ కేంద్రాల పరిధిలో 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు నమోదు చేసుకునేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలో మృతిచెందిన వారి ఓటు తొలగించే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను తప్పక పాటించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా బీఎల్వోల వారీగా పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మధు, సీనియర్ అసిస్టెంట్ సుధా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, సర్వేయర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

పరిహారం ఇప్పించండి

మనుబోలు : బద్వేలు–కృష్ణపట్నం పోర్టు హైవే నిర్మాణానికి భూసేకరణ కింద తీసుకున్న పొన్నూరమ్మ దేవాలయానికి సంబంధించిన భూమికి పరిహారం ఇప్పించాలని వడ్లపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ఈగా సురేష్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ శివకృష్ణయ్యను సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వడ్లపూడి గ్రామంలో ఉన్న గ్రామదేవత పొన్నూరమ్మ దేవాలయానికి సంబంధించిన 12 సెంట్ల భూమిని బద్వేలు– కృష్ణపట్నం పోర్టు జాతీయ రహదారి నిర్మాణం కోసం తీసుకున్నారని తెలిపారు. అందుకు సంబంధించి రూ.2.64 లక్షల పరిహారం ఇవ్వాల్సి ఉందని వివరించారు. రెవెన్యూ రికార్డుల్లో ఉన్న సాంకేతిక కారణాలను సాకుగా చూపి ఇంత వరకూ పరిహారం చెల్లించలేదన్నారు. వెంటనే పరిహారం మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై తహసీల్దార్ శివకృష్ణయ్య స్పందించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం మంజూరు చేయిస్తానని తెలిపారు.

మహాసంకల్పంతో పేదల జీవితాల్లో వెలుగులు



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర పేదల జీవితాల్లో వెలుగులు నింపిందని డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్ పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రను ప్రారంభించి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు నగరంలోని చేపల మార్కెట్ వద్దనున్న వైఎస్సార్ విగ్రహానికి డిప్యూటీ మేయర్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2017 నవంబర్ 6న ఇడుపులపాయ నుంచి ప్రజాసంకల్పయాత్రను ప్రారంభించారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు ఏమి అవసరమో తెలుసుకుని ప్రజా మేనిఫెస్టోను రూపొందించారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టోను అమలు చేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. ప్రజల వద్దకే పరిపాలన అంటూ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి వలంటీర్లతో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు అన్నీ ఏకమైనా ప్రజాఆశీస్సులతో 2024లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారన్నారు. నగర ప్రజల ఆశీస్సులతో నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మూడోసారి ఎమ్మెల్యే అవుతారన్నారు. కార్పొరేటర్ షేక్ కరిముల్లా, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ సిద్ధిక్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మీరామొహిద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ అబ్దుల్‌మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం

• కమిషనర్ వికాస్‌మర్మత్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): అర్జీదారులు సంతృప్తి చెందేలా వారి సమస్యలను పరిష్కరించాలని కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కమిషనర్‌కు విన్నవించారు. మొత్తం 36 అర్జీలను కమిషనర్ స్వీకరించారు. అందులో రెవెన్యూ 2, ఇంజనీరింగ్ 10, టౌన్‌ప్లానింగ్ 22, హెల్త్ విభాగానికి సంబంధించి 2 ఫిర్యాదులు ఉన్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పన్నుల వసూళ్లకు సంబంధించి సచివాలయాల అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. శని,ఆదివారాల్లో నిర్వహించిన ఓటర్ స్పెషల్ క్యాంపెయిన్‌లో 248 పోలింగ్ కేంద్రాల ద్వారా 1695 ఫారాలు అందుకున్నామని, వాటి ఆధారంగా ఓటరు జాబితాలో సవరణలు చేపట్టాలన్నారు. నగర వ్యాప్తంగా రోడ్ల నిర్మాణం, మంచినీటి సరఫరా, పార్కుల నిర్వహణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. వర్షాకాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని డివిజన్లలో పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలన్నారు. వర్షాలకు అండర్ బ్రిడ్జిలలో, రోడ్లపైన నీరు నిల్వ లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రెయిన్లలో పూడికతీత పనులు వెంటనే చేపట్టి నీటిపారుదలకు అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వినయతుల్లా, ఎస్‌ఈ సంపత్‌కుమార్, డీసీపీ దేవీకుమారి, ఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పూర్తిస్థాయిలో చేయూత

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో గుర్తించిన రోగులకు పూర్తిస్థాయిలో చేయూత నివ్వాలని, వారికి నయం అయ్యేవరకు చేయిపట్టి నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. సోమవారం ఆయన తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్షించారు. రోగులను మొబైల్ యాప్ ద్వారా ట్రాక్ చేసి ఆయా ఆస్పత్రులకు మ్యాప్ చేయా లన్నారు. అనంతరం విలేజ్ క్లినిక్‌కు, ఫ్యామిలీ డాక్టర్, గ్రామ సచివాలయాల్లోని వైద్యారోగ్య సిబ్బందికి అనుసంధానం చేయాలని సూచించారు. ఇలా ట్రాక్ చేసిన రోగులకు నయమయ్యే వరకు వైద్యసేవలు అందేలా కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. వీరందరికి డిసెంబర్ ఆఖరు నాటికి చికిత్సలు పూర్తి కావాలన్నారు. ఆరోగ్యశ్రీ వినియోగించుకోవడంపై రోగులు, ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని ఆసుపత్రుల్లో ఎక్కడైనా ఖాళీలు ఏర్పడితే వైద్యసేవలకు ఆటంకం కలగకుండా వెంటనే భర్తీకి చర్యలు చేపట్టాలన్నారు. జనవరి ఒకటి నుండి క్రమం తప్పకుండా ప్రతి మండలంలో నాలుగు హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, ఆరు నెలల్లో ప్రతి మండలంలో ప్రతి గ్రామంలో హెల్త్ క్యాంపులు జరిగే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరుగుతున్న మేలు, మంచి ప్రతిఒక్కరికీ తెలియచేయడానికి నవంబర్ 9 నుండి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించాలని, గ్రామాల్లో, వార్డుల్లో ఎంత మంచి జరిగిందో ప్రజల్లోకి తీసుకెళ్లడానికి చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య భద్రత లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపుల్లో గుర్తించిన వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న రోగులను పూర్తి ఆరోగ్యవంతులు అయ్యే వరకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, అందుకు తగిన అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు డిప్యూటీ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలి పాల్గొన్నారు.

కోవూరు సీఐగా వెంకటేశ్వరరావు

నెల్లూరు(క్రైమ్): కోవూరు సీఐగా డీ వెంకటేశ్వరరావును నియమిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీ వెంకటేశ్వరరావు ఇటీవల సీఐగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం పోలీసు పీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కోవూరు సీఐగా పనిచేస్తున్న కే రామకృష్ణారెడ్డి ఎస్‌బీ సీఐగా బదిలీ కావడంతో అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో వెంకటేశ్వరరావును నియమించారు. గతంలో వెంకటేశ్వరరావు కోవూరు ఎస్సైగా పనిచేశారు.

రేపు విద్యా సంస్థల బంద్



నెల్లూరు(టౌన్): విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ, కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 8న చేపడుతున్న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. నగరంలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో సోమవారం విద్యా సంస్థల బంద్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 మంది విద్యార్థి, యువకుల ప్రాణత్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కార్మికులు, ప్రజాసంఘాలు చేపడుతున్న ఆందోళనలు ఈ నెల 8వ తేదీ నాటికి వేయి రోజులు అవుతున్న సందర్భంగా వామపక్ష సంఘాలు విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయని తెలిపారు.

ప్రజారక్షణభేరిని విజయవంతం చేయండి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈ నెల 15న విజయవాడలో నిర్వహించనున్న ప్రజారక్షణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి మధు, జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పిలుపునిచ్చారు. గత నెల 30న ఆదోనిలో బయలుదేరిన ప్రజారక్షణ భేరి బస్సుయాత్ర సోమవారం నెల్లూరు నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా నగరంలోని వీఆర్సీసెంటర్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వాకె మాట్లాడారు. బీజేపీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో దేశానికి చేటు వస్తుందన్నారు. రానున్న రోజుల్లో బీజేపీని ఇంటికి సాగనంపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీపీఎం కార్యవర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు రమాదేవి, ప్రభాకర్, భాస్కర్, జిల్లా నాయకులు మోహన్‌రావు, అజయ్‌కుమార్, కత్తి శ్రీనివాసులు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి



నెల్లూరు(బారకాసు): రోడ్డుపై అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను వెంటనే తొలగించాలని బీవీనగర్‌కు చెందిన హరికృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయనతో పాటు స్థానికులు కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము బీవీనగర్లోని సంఘమిత్ర స్కూల్ వీధిలో నివసిస్తున్నామని తెలిపారు. తమ ఇంటి హద్దుకు పడమరవైపు ఉన్న రోడ్డులో అక్రమంగా కట్టడాలు ఉన్నాయని, ప్రస్తుతం ఇంకా కొత్తగా నిర్మాణాలు చేపడుతున్నారని విన్నవించారు. అక్రమ నిర్మాణాలతో రాకపోకలకు అంతరాయం ఏర్పడిందన్నారు. అందువల్ల అక్రమ కట్టడాలను వెంటనే తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

19న గాండ్ల, తెలికుల శంఖారావ మహాసభ



గాండ్ల, తెలికుల శంఖారావ మహాసభ ఆహ్వానపత్రికలను విడుదల చేస్తున్న దృశ్యం

నెల్లూరు(బారకాసు): ఈ నెల 19న రాజమండ్రిలో అఖిల గాండ్ల తెలికుల శంఖారావ మహాసభ నిర్వహించనున్నట్లు అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరవ అనంతం తెలిపారు. శనివారం ఆయన నెల్లూరులో సంఘ రాష్ట్రాధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు, గౌరవ సలహాదారుడు ప్రభాకర్, గౌరవాధ్యక్షుడు హరగోపాల్‌ను కలుసుకుని శంఖారావ మహాసభకు రావాలని ఆహ్వానించారు. అనంతరం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరవ అనంతం మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి కుల గణన ప్రారంభం కానున్న నేపథ్యంలో గాండ్ల, తెలికుల, తదితర కులాలకు సంబంధించి నెలకొన్న గందరగోళంపై వారిని చైతన్యపరిచేందుకు శంఖారావ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని గాండ్ల సామాజిక వర్గీయులందరూ హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాడి సత్యనారాయణ, గోపాలకృష్ణ, వెంకట్రావు, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారులతో మేయర్ సమీక్ష



టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమీక్షిస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో మేయర్ స్రవంతిజయవర్ధన్ పట్టణ ప్రణాళికా విభాగం, సర్వే విభాగం అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రీసర్వే, లేఅవుట్ల రెగ్యులరైజేషన్ స్కీం, భవనాల క్రమబద్ధీకరణ పథకం, నిర్మాణాల ప్లాన్ అనుమతులు, భవనాల మార్ట్‌గేజ్, ప్రచార పన్నుల వసూళ్లు, రోడ్డు ఆక్రమణలు, పన్నుల వసూళ్లు, తదిత అంశాలపై చర్చించారు. కార్పొరేషన్ మాస్టర్ ప్లాన్‌లో ఏమైనా మార్పులు..చేర్పులు జరిగాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రీసర్వే పురోగతిపై చర్చించారు. ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్ పథకాలకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి.. వాటిలో ఎన్నింటిని పరిష్కరించారో అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులను త్వరతగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రకటనల బోర్డుల వలన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన రిజిష్టర్ల నిర్వహణ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సిటీప్లానర్ దేవీకుమారి, ఏసీపీలు ధనుంజయ, దశయ్య, టీపీఓ ప్రవీణ్, టౌన్ సర్వేయర్ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా నిల్వలపై అప్రమత్తత అవసరం

• నెల్లూరు ఆర్డీఓ మలోల



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మలోల

నెల్లూరు రూరల్: నగర శివార్లలోని బాణసంచా గోదాముల వద్ద అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు ఆర్డీఓ మలోల అన్నారు. నగరంలోని నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో బాణసంచా గోదాముల నిర్వాహకులు, వివిధ శాఖల అధికారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాముల నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాల వద్ద అగ్నిప్రమాదాల నివారణకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా పోలీసు, అగ్నిమాపక శాఖల అధికారులు ముందస్తు తనిఖీలు నిర్వహించాలన్నారు. దీపావళి పండగను ప్రజలు సుఖశాంతులతో జరుపుకొనేందుకు అధికారులు విధి నిర్వహణలో అంకితభావంతో వ్యవహరించాలన్నారు. నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు, బాణసంచా గోదాముల నిర్వాహకులు పాల్గొన్నారు.

మహాకార్తీక దీపోత్సవానికి మేయర్‌కు ఆహ్వానం



మేయర్‌కు మహాకార్తీక దీపోత్సవ ఆహ్వానపత్రికను అందజేస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బారకాసు): కార్తీక పౌర్ణమి సందర్భంగా సింహపురి కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 26న నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం సమీపంలోని గణేష్ ఘాట్ వద్ద నిర్వహించనున్న మహాకార్తీక దీపోత్సవానికి హాజరు కావాలని మేయర్ పొట్లూరి స్రవంతిని ఆ సమితి సభ్యులు ఆహ్వానించారు. కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్‌ను సమితి అధ్యక్షురాలు కుడుముల వెన్నెల, ప్రధాన కార్యదర్శి బయ్యా మల్లిక, కోడూరు జయప్రద తదితరులు కలిసి సోమవారం ఆహ్వానపత్రికను అందజేశారు. తొలుత సమితి నిర్వాహకులు మేయర్‌ను శాలువాతో సత్కరించారు. మహాకార్తీక దీపోత్సవం సందర్భంగా గణేష్‌ఘాట్ వద్ద ప్రత్యేక పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని మేయర్‌ను కోరగా, అందుకు స్పందించిన మేయర్ నగర పాలక సంస్థ నుంచి అన్ని సౌకర్యాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం స్పందన కార్యక్రమంలో ఉన్న కమిషనర్ వికాస్‌మర్మత్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా



మాట్లాడుతున్న రంగారెడ్డి

నెల్లూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనలతో 29వ డివిజన్ గాంధీనగర్‌లోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి పాల్గొని మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులు అందజేస్తున్నారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక కార్పొరేటర్ సత్తార్, వైఎస్సార్‌సీపీ నాయకులు, వైద్యారోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

నెల్లూరు (దర్గామిట్ట): 2014 జూన్ 2 నాటికి ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను రెగ్యులరైజేషన్ చేస్తూ జీఓ విడుదల చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీజే గాంధీ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చి కాంట్రాక్ట్ లెక్చరర్స్ కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్ రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదన్నారు. ఐదేళ్ల సడలింపునకు కృషి చేసి మంత్రి కాకాణి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఇనపకుతిక సునీల్‌శర్మ, సాయికిరణ్, కోటేశ్వరరావు, కిరణ్‌రెడ్డి, గౌతమ్, విజయరాజు, తదితరులు పాల్గున్నారు.

విశ్రాంత హెచ్‌ఎంకు సన్మానం



నెల్లూరు(బృందావనం): దేశ వ్యాప్తంగా పేద బాలికల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న వంద మంది విశిష్ట వ్యక్తుల్లో ఒకరైన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మార్కాపురం రాంభూపాల్‌రెడ్డిని పురమందిరంలో వర్ధమాన సమాజం నిర్వాహకులు, గ్రంథాలయ అధికారి, విశ్రాంత అధ్యాపకుడు కొండా వెంకటస్వామి, కార్యదర్శులు ఎం ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాంభూపాల్‌రెడ్డి సేవలను కొనియాడారు.

చీరల పంపిణీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఉడ్‌హౌస్‌సంఘంలోని పేద మహిళలకు అమ్మ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం చీరలు పంపిణీ చేశారు. అనంతరం హరనాథపురంలో జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న అమూల్య అనే మహిళకు రూ.2 వేలు నగదు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్తికేయ, శశికిరణ్, వంశీరెడ్డి, శరత్‌కుమార్, రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నాటక పోటీల్లో జిల్లాకు అవార్డుల పంట



నెల్లూరు (బృందావనం): శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాంఘీక నాటక పోటీల్లో జిల్లాకు చెందిన కళాకారులు ప్రదర్శించిన నాటికకు ఐదు అవార్డులు దక్కాయని 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు ''శ్రీ క్రాంతి ఆర్ట్ థియేటర్స్‌కు చెందిన నెల్లూరు కళాకారులు ప్రదర్శించిన 'ఓ మనిషి కావాలి' అనే సాంఘీక నాటిక ప్రథమ ఉత్తమ ప్రదర్శన అవార్డు అందుకుందని చెప్పారు. ఉత్తమ రచన అవార్డును పనసాల, ఉత్తమ జ్యూరీ నటుడు అవార్డును బొమ్మలాట పార్వతీశం, ఉత్తమ నటి అవార్డును కమలమ్మ పాత్రధారి జ్యోతిరాణి, ఉత్తమ రంగాలంకరణ అవార్డును శ్రీధర్ అందుకున్నారని చెప్పారు. ఈ నాటికకు దర్శకుడిగా తంబు సురేష్ బాబు సంస్థ అధ్యక్షుడు చిల్లర సుబ్బారావు, టీమ్ ఆర్గనైజర్‌గా బొమ్మలాట పార్వతీశం వ్యవహరించారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని అమరావతి కృష్ణారెడ్డి అభినందించారు.